ఒక మంచి
పాఠకురాలిని
అందమైన అమ్మాయిగా
మార్చాడా?

# పాముర్రాడి విశ్వేశ్వర రావు కథ


ప్రేరణ

మొట్టమొదటిసారి వేణు నాకు పరిచయమయ్యింది డిగ్రీ సెకండియర్ చదువుతున్న రోజుల్లో. ఇప్పుడెలా వుందో నాకు తెలీదు కానీ ఆ రోజుల్లో వైజాగ్ గవర్నమెంటు కాలేజీలో చదువుతున్నామని చెప్పుకోవడానికి గర్వంగా ఉండేది. అందంగా, సుస్మితంగా, ముట్టుకుంటే కందిపోతాడే మోనవ్నంత మృదువుగా ఉండేవాడు వేణు. చక్కటి బొమ్మలు కూడా గీస్తాడని తెలియంగానే అతనితో స్నేహం చేయాలనే కోరిక కలిగింది.

అప్పటికే నేనొక రచయితగా నాకొక గుర్తింపు కాలేజీలో ఉండేది. నా కథలన్నీ ముందు తనే చదివేవాడు. అతను చెప్పే మార్పులు, చేసే విమర్శలు నన్ను బాగా ఆకట్టుకునేవి. కానీ అతనిలో ఒక లోపం ఉండేది. అతనిలో విమర్శనాశక్తి చక్కగా వుంది కానీ సృజనాత్మకత లోపించేది. ఏదైనా ఒక మంచి చిత్రాన్ని చూసి దాన్ని యథాతథంగా చక్కగా గీయగలిగేవాడు కానీ ఒక అనుభూతిని స్వయంగా పొంది, దాని తాలూకు ప్రేరణతో గీస్తే అద్భుత కళాఖండాలు సృష్టించగలడని నా నమ్మకం.

అతనిలో ఈ సృజనాత్మకత పెంపొందేలా చూడడానికి నేను ప్రయత్నించేవాడిని. నేను వ్రాసిన కవితలు చూపించి ఆ భావానికి తగ్గట్టుగా బొమ్మలు గీయమనేవాణ్ణి. అతను గీసేవాడు. నేను కొన్ని సలహాలు ఇచ్చేవాణ్ణి.

అలాగే నేను వ్రాసే కథలకు కూడా బొమ్మలు గీయించడం అలవాటు చేశాను. క్రమక్రమంగా అతనిలో చాలా మార్పు



కనిపించింది. సృజనాత్మకత అనేది ఒకరు అలవాటు చేస్తే వచ్చేది కాదు. కానీ ఏ కళాకారుడికైనా ఒకింత స్ఫూర్తినిచ్చి ప్రోత్సహిస్తే అతనిలో సృజనాత్మకత బహిర్గతమవుతుంది. నిజానికి వారిలో సృజనాత్మకత ఉంటుంది. మనం చేయవలసిందల్లా అది వారు తెలుసుకొనేటట్లు చేయడమే.

ఇదే నేను చూసింది. ఇక ఆ తర్వాత

అతను స్వయంగా ఊహించి ఎన్నో బొమ్మలు వేశాడు. వాటిల్లో చాలా వాటికి బహుమతులు కూడా వచ్చాయి. అతని చేత మంచి బొమ్మలు వేయించాలని నేనుకూడా మంచి కథలు వ్రాయాలని అనుకునేవాణ్ణి. అలా ఇద్దరం పరస్పరం ఒకరినొకరు ప్రేరణ అయ్యాము. నాకు కూడా రచయితగా చక్కటి గుర్తింపు పెరిగింది.

ఇంతలో అనుకోకుండా నాకు నెల్లూరు ట్రాన్స్ఫర్ అవడంతో తప్పనిసరి పరిస్థితులలో వేణుకు దూరం కావలసి వచ్చింది. ఆరోజు మా బాధ వర్ణనాతీతం. ముఖ్యంగా వేణుకి నామీద అపారమైన గౌరవం. నిజానికి నేను చేసింది తక్కువే. అయినా, ఎవ్వరడిగినా నేనే తనకు ప్రేరణ అని చెప్పేవాడు.

అలాంటి వ్యక్తి నుండి దూరం అవ్వడమంటే బాధగానే ఉంటుంది కదా! వారానికి రెండు ఉత్తరాలు వ్రాయాలని చెప్పాడు. నెలకోసారి మనం కలుసుకోవాలనీ, ఇంకా ఇలాంటివే ఏవేవో షరతులు పెట్టాడు.

అన్నింటికీ సరేనన్నాను. ఒక మంచి విమర్శకుణ్ణి విడిపోవడానికి నాకూ చాలా బాధగానే వుంది. కానీ తప్పదు కదా! నెల్లూరు వచ్చేశాక కూడా కొన్నాళ్ళు అలవాటు పడలేకపోయాను.

కాల్రకమేణా నెల్లూరు నాకు బాగా నచ్చింది. పెన్నా తీరంలోనూ, రంగనాయకులు గుడిలోనూ గంటలు గంటలు గడిపేవాడిని. నిజానికి ఆ రెండూ నాకెంతో స్ఫూర్తినిచ్చాయి. అక్కడ కూర్చుని ఎన్నో కథలు వ్రాశాను.

దాదాపు అన్నీ నాకు మంచి పేరు తెచ్చిపెట్టాయి.

ఒక విధంగా చెప్పాలంటే నెల్లూరు నాకు అన్ని రకాలుగానూ లాభించింది. రచయితగా నా పేరు ఇంకా పెరిగింది. నేను వ్రాసిన నవల ఒకటి కొంటామంటూ ఒక సినీ నిర్మాత నుంచి కబురుకూడా వచ్చింది.

కానీ ఇక్కడ వేణు పరిస్థితి నా పరిస్థితికి పూర్తి విరుద్ధంగా తయారయ్యింది. మొదట్లో ఉత్తరాలు బాగానే వ్రాసేవాడు. తరువాత తరువాత అస్సలు రావడం లేదు. నేను వచ్చేసిన తరువాత అతను ఒక్క బొమ్మకూడా గీయలేదనీ, అసలు బొమ్మలు గీయడమే మానుకున్నాడనీ తెలిసిన వాళ్ళద్వారా తెలిసింది.

దానితో నా మనసు విలవిలలాడిపోయింది. ఇక లాభం లేదని ఒకసారి నేనే స్వయంగా వెళ్ళాను. మళ్ళీ మునుపటిలా అతనిని ప్రోత్సహించి మాట్లాడాను.

మీరు వెళ్ళిపోయిన తర్వాత బొమ్మలు వేయబుద్ధి కావడం లేదన్నాడు. అతనికి అన్ని రకాలగానూ చెప్పి ఒప్పించాను.

ఆ తర్వాత లతనిని కలవడం అస్సలు కుదరలేదు. ఏదో నా ముందు ఒప్పుకున్నప్పటికీ, అతను సరిగా శ్రద్ధ చూపడం లేదని తెలిసింది. ఈలోగా నేను మరింత బిజీ అయ్యాను. ఇలాంటి పరిస్థితుల్లో అతని దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

ఎలాగైనా నన్ను మళ్ళీ హైద్రాబాదు వచ్చేయమని వ్రాశాడు. కానీ ఎందుకో నాకది ఇష్టం లేకపోయింది. ఎందుకంటే నెల్లూరు నాకు సెంటిమెంటల్‌గా అచ్చొచ్చిన ప్రదేశం. పైగా మద్రాసుకు దగ్గర.

ఈ కారణం చేత నాకు తిరిగి హైౖదాబాదు వెళ్ళడం సుతరామూ ఇష్టం లేకపోయింది.

ఆ తర్వాత మరో ఏడాదిపాటు మా మధ్య ఏ సమాచారమూ లేదు. ఎప్పుడైనా ఏదైనా కొత్త బొమ్మ వేసేదేమోని ఉత్తరం కోసం ఎదురుచూసేవాడిని.

కానీ అతనసలు తానొక చిౖతకారుడిన్న విషయమే మర్చిపోయాడు. ఇంతలో అకస్మాత్తుగా అతని దగ్గరనుంచి శుభలేఖ వచ్చింది. హైౖదాబాదులోనే పెళ్ళి.

ఇంత అకస్మాత్తుగా ఎందుకు చేసుకుంటున్నాడని సందేహం కలిగింది. తప్పకుండా రావాలని లెటర్ కూడా రాశాడు.

తీరిక చేసుకుని రెండు రోజులుండేలా వెళ్ళాను. వేణులాంటి అందగాడికి కాబోయే





భార్య ఎలా ఉంటుందోనన్న ఆత్రం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేసింది.

కానీ తీరా ఆమెని చూసేసరికి ఖంగుతి న్నాను. ఆమె చాలా మామూలుగా వుంది. ఫ్రాంక్‌గా చెప్పుకోవాలంటే వేణుముందు ఏమాత్రం సరిజోడిగా నిలవలేదు. నాకు చాలా నిరాశ కలిగింది.

వేణు మాత్రం చాలా హుషారుగా ఉన్నాడు.

కానీ నాకు లోపల్లోపల ఏదోలా వుంది. ఒకవేళ ఏదైనా తప్పనిసరి పరిస్థితుల్లో చేసుకోవాల్సి వచ్చిందేమోననే అనుమానం వచ్చింది.

కానీ వేణుతో మాట్లాడాక ఆ అనుమానం పటాపంచలైపోయింది. అతనిది ప్రేమ వివాహమని చెప్పాడు. నాకు నోటమాట రాలేదు. చూస్తూచూస్తూ ఇలాంటి అమ్మాయిని ఎలా ప్రేమించాడో అర్థం కాలేదు. అయినా నా ఫీలింగ్స్ వేణు గమనిస్తే బావుండదని చిరునవ్వు పులుముకున్నాను.

ఆ తర్వాత తర్వాత మా మధ్య సంబంధాలు బాగా మెరుగయ్యాయి. మళ్ళీ ఉత్తరాలు రాయడం మొదలుపెట్టాడు. తను మళ్ళీ బొమ్మలు గీయడం మొదలుపెట్టిన ట్టు రాశాడు. నాకు చాలా సంతోషం కలిగింది.

తనలోని కళకి మళ్ళీ జీవం పోసింది తన భార్యేనని రాసేవాడు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఈమెలో ఇంత కళాతృష్ణ ఉందన్న మాట అనుకున్నాను.

అయినా నాలో ఏదో తెలియని అసంతృప్తి. ఆమాత్రం ప్రోత్సాహం ఇచ్చే అమ్మాయిలు ఎంతమందైనా దొరుకుతారు. మరీ ఇలాంటి సాధారణమైన అందంవున్న అమ్మాయిని చేసుకున్నాడనే జాలి కలిగేది నాకు. వేణు మాత్రం తన భార్యలోని క్వాలిటీస్, ఆమె ఆహ్లాదకరమైన ప్రవర్తన వీటి గురించే రాసేవాడు. వీటివల్ల నాకు ఆమెపైన గౌరవభావం కలిగినా మనసు పొరల్లో ఏదో అసిజీగా వుండేది.

పెళ్ళి చేసుకోమని ఇంటిదగ్గర్నుంచి ఉత్తరాల మోత ప్రారంభమైంది. ఇన్నాళ్ళూ రచయితగా నాకో గుర్తింపు వచ్చేంతవరకూ చేసుకోనని వాయిదా వేస్తూ వచ్చాను.

ఇప్పుడిక కాదనడానికి నాకే అభ్యంతరమూ కనబడలేదు. వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇస్తూ లెటర్ రాశాను. నేను రాసిన మూడో రోజుకే పెళ్లిచూపులకి రమ్మని కబురొచ్చింది.

ఆ అమ్మాయి పేరు నీరజట. అందానికి మారుపేరులా వుంది.

నా రచనలు ఏవైనా చదివారా అనడిగాను తాను అంతగా చదవలేదనీ, కానీ తన స్నేహితురాళ్ళకు తను అభిమాన రచయితనని చెప్పింది.

ఆమె నా రచనలు చదవనందుకు నిరుత్సాహం కలిగినా, సర్దుకున్నాను. అమ్మా, నాన్నలతో నాకిష్టమేనని చెప్పాను. ఇంతకుముందు చదవకపోతేనేం, ఇకముందు అలవాటు చెయ్యొచ్చు అనుకున్నాను. ఆమె అందంముందు ఇదేమీ ఒక అవరోధంగా అనిపించలేదు నాకు. ఒక అందమైన అమ్మాయిని మంచి పాఠకురాలిగా మార్చుకోవచ్చుగానీ, ఒక మంచి పాఠకురాలిని అందమైన అమ్మాయిగా మార్చలేము కదా అనుకున్నాను.

పెళ్ళికి వేణు భార్యాసమేతంగా వచ్చాడు. ఆ మర్నాడు మావూళ్ళో అతను గీసిన బొమ్మల ప్రదర్శన ఉందని చెప్పాడు. నేను ఆశ్చర్యపోయాను. ఎంత ఎదిగాడు వేణు? నా భార్యకి పరిచయం చేశాను.

పెళ్ళయిన మొదటి నెల రోజులూ, ముప్పై క్షణాల్లా గడిచిపోయింది మాకు. ముఖ్యంగా ఆమె అందాన్ని చూస్తూ ఎంతకాలమైనా గడిపెయ్యొచ్చు అనుకున్నాను. కానీ క్రమంగా ఆమెలోని మరో మనిషి అవగతమయ్యింది నాకు.

నేను కొత్తగా రాసిన కథని చదివి అభిప్రాయం చెప్పమని అడిగితే, అబ్బో ఇలాంటివి నాకు బోర్ బాబూ అంది. నేను షాక్ తిన్నాను. మరోసారి సాయంత్రం బాల్కనీలో కూర్చుని కథ రాసుకుంటుంటే ఇలాంటివన్నీ బయటే రాసుకోవచ్చుగా అని సలహా ఇచ్చింది.

అప్పుడర్థమయ్యింది నాకు. ఆమెకు తన భర్త గొప్ప రచయితనే పేరు కావాలి. ఒక రచయిత భార్యగా తనకో గుర్తింపు కావాలి.

కానీ వ్యక్తిగతంగా ఆమె ప్రోత్సాహం ఏమీ ఉండదు. ఇంట్లో తను ఎప్పుడైనా రాసుకోవడం మొదలుపెడితే, తనను నిర్లక్ష్యం చేస్తున్నానని నిందించేది. ఈ గొడవ భరించలేక నేను రాయడం మానేసేవాణ్ణి. క్రమంగా నాలోని రచయిత మరుగైపోవడం ప్రారంభించాడు.

మంచి రచనలు చేయాలనే ఉత్సాహం నాలో పూర్తిగా చచ్చిపోయింది. వేణు, అంత సాదాగా ఉన్నా కూడా ఆ అమ్మాయిని ఎందుకు చేసుకున్నాడో అప్పుడర్థమయ్యింది నాకు. అంతవరకూ అతనిని చూసి జాలిపడేవాణ్ణి.

కానీ అతను ఎంతో గర్వపడేవాడు. ఎంతో గర్వపడుతూ పెళ్ళిచేసుకున్న నేను, నామీద నాకే జాలికలిగే పరిస్థితికొచ్చాను.

సరైన జీవిత భాగస్వామిని ఎన్నుకోవడం పురుషునికైనా, స్త్రీకైనా ఎంతో అవసరం. అందానికి ప్రాధాన్యత ఇవ్వకుండా, ఆమె అభిరుచులకి విలువిచ్చి వివాహం చేసుకున్నందుకు వేణులోని చిత్రకారుడు పునర్జన్మ ఎత్తాడు. సౌందర్యారాధన ముసుగులో కేవలం అందానికే విలువిచ్చిన ఫలితంగా నాలోని రచయిత చచ్చిపోయాడు.

ఎన్నో కథల్లో జీవితాన్ని చక్కగా చిత్రించిన నేను, నా జీవితాన్ని సరిగ్గా నియంత్రించుకోలేక పోయినందుకు నాకు సరైన శిక్షే పడింది. *



## పోయింది

ఓ డ్రామా యాక్టర్ని అడిగాడు ఫ్రెండ్.
"ఏరా గ్లిజరిన్ కొనుక్కెళ్తున్నావ్? ఏదైనా డ్రామాలో నటిస్తున్నావా?"
"లేదురా. మావిడ పోయింది. అందుకనే..."

దాసరి విజయభాస్కర్ (పీరాం)